## కామన్ డైట్ ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం చేయాలి

- పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించాలి
- పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందించాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కలెక్టరేట్, డిసెంబర్ 12: రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీ, మాడల్ స్కూల్స్, ఆశ్రమ పాఠశాలల్లో ఈ నెల 14న కామన్ డైట్ ప్రారంభోత్స వానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కామన్ డైట్ మెనూ అమలుపై సంబంధిత అధి కారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామన్ డైట్ కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రారంభోత్సవ కార్యక్రమానికి పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించాలని సూచించారు. ప్రభుత్వ విద్యాలయాల్లో కామన్ డైట్ ప్లాన్ శనివారం నుంచే అమల్లోకి వస్తుందని, అంతటా ఒకే రకమైన ఆహారం విద్యార్థులకు అందిస్తారని చెప్పారు. కిచెన్, డైనింగ్ ఏరియాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఈవో జగన్మోహన్ రెడ్డి, రెసిడెన్షియల్ పాఠశాలల ఆర్‌సీవోలు, ప్రిన్సిపాల్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## దాతల సహకారం.. విద్యార్థులకు అల్పాహారం

- 'నమస్తే' కథనానికి స్పందన
- రూ.10వేల ఆర్థిక సాయం



విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న దాతలు

కోనరావుపేట, డిసెంబర్ 12: కొలనూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్పెషల్ క్లాసులకు హాజరయ్యే పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందజేసేందుకు దాతలు ముందుకు వచ్చారు. పదో తరగతి పిల్లలకు అల్పాహారం ఏదంటూ..? ఇటీవల 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితం కాగా, డీఈవోతోపాటు దాతలు స్పందించారు. పాఠశాలకు గురువారం రూ.10వేల సాయాన్ని అందించారు. దీంతో సాయంత్రం వేళ అల్పాహారం పెట్టగా, విద్యార్థులు సంబురపడ్డారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందిస్తామని డీఈవో వెల్లడించారు. ఇక్కడ హెచ్‌ఎం శ్రీపతి శ్రీనివాస్, మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్ వీరబోయిన తిరుపతి యాదవ్, పాఠశాల అధ్యక్షులు మెరుగు స్రవంతి పాల్గొన్నారు.

# పకడ్బందీగా గ్రూప్-2 పరీక్షలు

- ఎక్కడా ఇబ్బందులు రాకుండా నిర్వహించాలి
- అభ్యర్థులు ఒక రోజు ముందుగానే సెంటర్ చిరునామాను సరిచూసుకోవాలి
- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఏఎస్పీ చంద్రయ్య
- పరీక్షల నిర్వహణపై అధికారులు, సిబ్బందికి శిక్షణ



శిక్షణ కార్యక్రమానికి హాజరైన అధికారులు



మాట్లాడుతున్న జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టర్ ఖీమ్యానాయక్, చిత్రంలో అదనపు ఎస్పీ చంద్రయ్య

కలెక్టరేట్, డిసెంబర్ 12: జిల్లాలో ఈ నెల 15, 16 తేదీల్లో గ్రూప్ –2 పరీక్షలను పకడ్బందీగా, ఎక్కడా ఇబ్బందులు రాకుండా నిర్వహించాలని అదనపు రెవెన్యూ కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఏఎస్పీ చంద్రయ్య ఆదేశించారు. గ్రూప్ –2 పరీక్షల నిర్వహణపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో అబ్జర్వర్స్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్, చీఫ్ సూపరింటెండెంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, లోకల్ రూట్ ఆఫీసర్లకు గురువారం శిక్షణ ఇచ్చారు. పరీక్ష కేంద్రంలో నిర్వర్తించాల్సిన విధులపై వివరించారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడారు. టీజీపీఎస్సీ ఆదేశాల మేరకు 15న ఆదివారం ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు, మ ధ్యాహ్నం 3 నుంచి 05.30 గంటల వరకు, 16న ఉద యం 10 నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 05.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 7,163 మంది హాజరు కానున్నారని వెల్లడించారు. ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే కేంద్రంలోనికి అనుమతించాలని స్పష్టం చేశారు. జిల్లాలో 26 సెంటర్లు ఏర్పాటు చేశామని, ఒక్కో సెంటర్‌కు 26 మంది చొప్పున అబ్జర్వర్స్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్, చీఫ్ సూపరింటెండెంట్స్ నియమించినట్లు వివరించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పరిశుభ్రత పనులు చేయించాలని, సెస్ అధికారులు కరెంట్ సరఫరాలో లోపాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు.

### సెంటర్ చిరునామా సరి చూసుకోవాలి

పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఒక రోజు ముందే తమ పరీక్ష కేంద్రం చిరునామా సరిచూసుకోవాలని సూచించారు. బయో మెట్రిక్ అటెండెన్స్ ఉన్నందున అభ్యర్థులు పరీక్ష రోజు నిర్దేశించిన సమయానికంటే ముందే చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ గుర్తింపు కార్డులు మినహా ఏమీ వెంట తీసుకురావద్దని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో ఎగ్జామ్ సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్లు, ఆర్సీవో, జేఎన్టీయూ అగ్రహారం కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

# యువకులు క్రీడల్లో రాణించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- దేగావత్‌తండాలో యువకులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు అందజేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్, పోలీసులు

రుద్రంగి, డిసెంబర్ 12: గ్రామీణ ప్రాంత యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. గురువారం దేగావత్‌తండాలో యువకులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేసి, మాట్లాడారు. గ్రామీణ యువత క్రీడల్లో మరింత రాణించాలన్నారు. క్రీడల వల్ల క్రమశిక్షణ పెరుగుతుందని, మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందన్నారు. ప్రజా శ్రేయస్సే పోలీసుల ధ్యేయమని, శాంతిభద్రతల పరిరక్షణకు నిత్యం కృషిచేస్తున్నట్లు చెప్పారు. యువత గంజాయి, మత్తు, చెడు మార్గాల వైపు వెళ్లకుండా పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళా, దోస్తీ మీట్ వంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడల నిర్వహణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడు ప్రోత్సాహం అందిస్తుందని చెప్పారు. యువత ఉన్నత స్థాయికి ఎదగాలంటే చదువుపై దృష్టి పెట్టి మంచి కొలువులు సాధించాలని, తల్లితండ్రులు, పుట్టిన ఊరుకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామాల నుంచి ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లేవారు నకిలీ ఏజెంట్లకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇమిగ్రేషన్ చట్టబద్ధత ఉన్న వారి నుంచే వీసాలు పొందాలన్నారు. కార్యక్రమంలో చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ అశోక్, తండా నాయకులు దేగావత్ తిరుపతి, పోలీస్ సిబ్బంది, క్రీడాకారులు ఉన్నారు.

## వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించాలి

కలెక్టరేట్, డిసెంబర్ 12: చలికాలం దృష్ట్యా జిల్లాలోని మారుమూల గిరిజన ప్రాంత హాస్టళ్లలో పూర్తి స్థాయి వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గురజాల శ్రీధర్ డిమాండ్ చేశారు. జిల్లాలోని గిరిజన హాస్టళ్లలో విద్యార్థులు చలి తీవ్రతకు ఇబ్బందులు పడుతున్నారని, వేడి నీటి సౌకర్యం కల్పించాలని, అవసరమైన దుప్పట్లు అందజేసేందుకు విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు.

## పాఠశాలకు సీసీ కెమెరాల అందజేత

ఇల్లంతకుంట, డిసెంబర్ 12 : వల్లంపట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ.20 వేల విలువైన సీసీ కెమెరాలను తాజా మాజీ సర్పంచ్ కేతిరెడ్డి అనసూయ భర్త కేవియన్ రెడ్డి గురువారం అందజేశారు. తన సొంత ఖర్చులతో సీసీ కెమెరాలను అందించగా, ప్రధానోపాధ్యాయుడు దూస గోవర్ధన్ వాటిని ప్రారంభించారు. మాజీ సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## దత్తాత్రేయ స్వామి ఆలయం పరిశీలన

బోయినపల్లి, డిసెంబర్ 12: వరదవెల్లి దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని టూరిజం శాఖ అధికారులు పరిశీలించారు. ఈ నెల 14 నుంచి 16 వరకు జరిగే జయంతి ఉత్సవాలకు భక్తులు గుట్టపైకి వెళ్లేందుకు బోట్లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో టూరిజం శాఖ ఎండీ ప్రకాశ్‌రెడ్డి ఆదేశాల మేరకు బోట్ సేఫ్టీ అథారిటీ మెంబర్ కిరణ్‌కుమార్ మధ్యమానేరు జలాశయంలో ఉన్న దత్తాత్రేయ స్వామి ఆలయానికి వచ్చి బోట్ ఫిట్‌నెస్‌ను, సామర్థ్యాన్ని పరిశీలించారు. అలాగే భక్తులకు లైఫ్ జాకెట్ తప్పకుండా వేసుకునేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు.

## కనుల పండువగా అయ్యప్ప పడిపూజ

చందుర్తి,డిసెంబర్ 12: మండల కేంద్రంలోని గచ్చు బావి ఆవరణలో గురువారం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. గురుస్వామి గూడెం చక్రవర్తుల పురుషోత్తమ చార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగగా, 'స్వామియే శరణం అయ్యప్ప' నామస్మరణతో మండల కేంద్రం మార్మోగింది. బీఆర్‌ఎస్ సీనియర్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, వివిధ రాజకీయ పార్టీల నాయకులు వచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

తెలంగాణ చౌక్, డిసెంబర్ 12: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సిరిసిల్లలో జరిగింది. సిరిసిల్ల టౌన్ ఎస్ఐ మల్లేశం తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లంతకుంట మండలం వెంట్రావ్‌పల్లికి చెందిన ములుకల నరేష్(38) బతుకుదెరువు కోసం సిరిసిల్లకు వచ్చి సంజీవయ్యనగర్‌లో ఓ ఇంట్లో కిరాయికి ఉంటూ ఇంటి నిర్మాణ సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. భార్య స్రవంతితో మనస్పర్థలు వచ్చి ఆరేండ్ల క్రితం విడాకులు తీసుకున్నాడు. వీరికి ఒక్క కూతురు, కొడుకు ఉన్నారు. అయితే నరేష్ మూడు నెలల క్రితం సులోచన అనే యువతిని పెండ్లి చేసుకొని సంజీవయ్యనగర్‌లో ఉంటున్నారు. తన తల్లి లచ్చవ్వకు ఇటీవల ఆరోగ్యం బాగాలేక వైద్యం చేయించగా, సుమారు రూ.2 లక్షల అప్పు అయింది. నరేష్‌కు ఫిట్స్(మూర్ఛవ్యాధి) ఉంది. పనులు సరిగ్గా దొరక్కపోవడం, మరోవైపు ఆర్థికంగా ఇబ్బందులు పెరగడంతో జీవితంపై విరక్తి చెంది ఇంటో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. తల్లి లచ్చవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## భూవివాదంలో ముగ్గురిపై దాడి.. గాయాలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 12: వెంకటాపూర్‌కు చెందిన రెండు కుటుంబాల మధ్య నెలకొన్న భూ వివాదంలో ఓ కుటుంబానికి చెందిన వ్యక్తులు మరో కుటుంబంపై దాడి చేయగా ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపూర్‌కు చెందిన బోయిని నర్సయ్య, బోయిని ముత్తయ్య కుటుంబాల మధ్య భూవివాదం ఉన్నది. బోయిని నర్సయ్య, అతని కుటుంబ సభ్యులు స్వర్ణలత, ఉమలత, ప్రసన్న కలిసి బోయిని ముత్తయ్య, అతని భార్య పోచవ్వ, దివ్యాంగురాలైన కూతురు పద్మపై దాడి చేయగా, గాయాలయ్యాయి. ముగ్గురిని మండల కేంద్రంలోని అశ్విని హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉన్నది.


## ఉపాధ్యాయుల ఆర్థిక చేయూత



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న హెచ్‌ఎం, టీచర్లు

గంభీరావుపేట, డిసెంబర్ 12: మల్లారెడ్డిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన సహాయకురాలు కందుకుల వరలక్ష్మి కొడుకు నవీన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, బాధిత కుటుంబానికి స్కూల్ టీచర్లు భరోసాగా నిలిచారు. గురువారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించి ఔదార్యం చాటుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సింగరావు, శంకర్, కనుకయ్య, సత్యనారాయణ, రజని, లక్ష్మీనారాయణ, పుష్పలత, ప్రమీల, స్రవంతి, శ్రీనివాస్, మనోహర్, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

## చందుర్తి ఎస్ఐగా అంజయ్య



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ

చందుర్తి,డిసెంబర్ 12: చందుర్తి ఎస్ఐగా అంజయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. మొన్నటిదాకా ఇక్కడ పనిచేసిన శ్రీకాంత్ జిల్లా హెడ్ క్వార్టర్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. కాగా, వేములవాడ టౌన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న అంజయ్యను ఇక్కడి బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేయగా గురువారం బాధ్యతలు చేపట్టారు. అంజయ్య మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, గుడుంబా, గంజాయి, ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతానని స్పష్టం చేశారు.

## ముగిసిన సీఎం కప్ క్రీడలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 12: సీఎం కప్ పోటీలు గురువారం ముగియగా, విజేతలకు అధికారులు బహుమతులు అందించారు. కోకో మహిళా విభాగంలో అల్మాస్‌పూర్ జట్టు మొదటి, వెంకటాపూర్ జట్టు రెండో బహుమతిని సాధించాయి. పురుషుల విభాగంలో బొప్పాపూర్ జట్టు మొదటి, బాకుర్‌పల్లి జట్టు రెండో బహుమతిని సాధించాయి. కబడ్డీ మహిళా విభాగంలో అల్మాస్‌పూర్ ప్రథమ స్థానంలో నిలువగా, బొప్పాపూర్ రెండో బహుమతిని కైవసం చేసుకున్నాయి. పురుషుల విభాగంలో అల్మాస్‌పూర్ జట్టు మొదటి, గొల్లపల్లి జట్టు రెండో బహుమతిని గెలుచుకున్నాయి. వాలీబాల్ మహిళా విభాగంలో బొప్పాపూర్ మొదటి, అల్మాస్‌పూర్ రెండో స్థానాన్ని, పురుషుల విభాగంలో బొప్పాపూర్ మొదటి, హరిదాస్‌నగర్ రెండో స్థానంలో నిలువగా అధికారులు బహుమతులు అందించారు. ఇక్కడ ఎంపీడీవో సత్తయ్య, మండల విద్యాధికారి జీ. కృష్ణహరి, కార్యదర్శి ప్రవీణ్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.

NT-338978-AII

LOST

తేది: 25-11-2024, సోమవారం రోజున గోదావరిఖనిలోని జిరాక్స్ సెంటర్ నుండి మా ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో నా యొక్క ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ (నెం: 6092/1991) పోయినది. దొరికిన వారు సంప్ర: పిట్టల సదానందం, S/o. రాయమల్లు. సెల్: 99592 61561.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571

9182 777 189

## గెలుపోటములు సహజం

వేములవాడ రూరల్, డిసెంబర్ 12: క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, సమానంగా స్వీకరించాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారయణగౌడ్ సూచించారు. గురువారం నూకలమర్రిలో జరిగిన సీఎం కప్ టోర్నీ ముగింపు సమావేశానికి హాజరై, మాట్లాడారు. సీఎం కప్‌లో గెలుపొందిన వారిని జిల్లాస్థాయికి ఎంపిక చేస్తారని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఇక్కడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, తహసీల్దార్ సుజాత, ఎంఈవో కిషన్, ఎంపీడీవో శ్రీనివాస్, హెచ్‌ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

## రాజన్నను దర్శించుకున్న సినీ నటి



సినీ నటి కల్ప లతకు స్వామివారి ప్రసాదాన్ని అందజేస్తున్న ప్రధానార్చకులు శరత్

వేములవాడ టౌన్, డిసెంబర్ 12: వేములవాడ రాజరాజేశ్వరస్వామిని గురువారం సినీ నటి గార్లపాటి కల్పలత దర్శించుకున్నారు. ఆలయంలో ఆమెతో అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ అద్దాల మండపంలో ప్రధానార్చకులు చంద్రగిరి శరత్ ఆధ్వర్యంలో అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసి శేష వస్త్రం కప్పి, స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

## ముగిసిన గీతాజయంతి ఉత్సవాలు

వేములవాడ టౌన్, డిసెంబర్ 12: రాజన్న ఆలయంలో మూడ్రోజులుగా నిర్వహించిన గీతాజయంతి ఉత్సవాలు గురువారం పూర్ణాహుతితో ముగిశాయి. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అర్చనలు, గీతా ప్రవచనాలు, గీతా హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నాగిరెడ్డి మండపంలో సంస్కృత కళాశాల, పాఠశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు భగవద్గీత శ్లోకాలను పఠించారు. నాగిరెడ్డిమంటపంలో హవనం నిర్వహించి, పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధానార్చకులు చంద్రగిరి శరత్, అర్చకులు దేవరాజు భాస్కర్, ప్ర తాప శ్రీనివాస్, గోపన్నగారి గణేశ్, మామిడిపెల్లి శరత్, ఆలయ పర్యవేక్షకులు తిరుపతిరావు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 12: రజక సంఘం(నెహ్రూ నగర్) నూతన కమిటీ అధ్యక్షుడిగా మారుపాక శ్రీనివాస్ గెలుపొందారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎన్నికలలో మారుపాక శ్రీనివాస్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు పట్టణాధ్యక్షుడు దండు శ్రీనివాస్ తెలిపారు. నూతనంగా ఎన్నికైన మారుపాక శ్రీనివాస్‌ను రజక సంఘం నాయకులు అక్కరాజు శ్రీనివాస్, పట్టణ రజక సంఘం అధ్యక్షుడు దండు శ్రీనివాస్, రజక సంఘం నాయకులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలయ్య, కాసర్ల మహేందర్, బండి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగుల వంటావార్పు



కలెక్టరేట్: మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ సమగ్ర శిక్షా ఒప్పంద ఉద్యోగులు గురువారం వంటా వార్పు చేపట్టి నిరసన తెలిపారు. రగుడు జంక్షన్ వద్ద చేపట్టిన రిలే దీక్షలు మూడో రోజుకు చేరగా, జిల్లా వ్యాప్తంగా సేవలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీపతి చంద్రమౌళి మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా పే స్కేల్ ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గత 20 ఏండ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామని, కుటుంబ పోషణ భారమైపోతుందన్నారు. పేస్కేల్ ఇచ్చి తమకు న్యాయం చేయాలన్నారు. విద్యాశాఖలో పనిచేస్తున్న తమకు తక్కువ వేతనాలతో ఎక్కువ పనిచేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవిత బీమా కింద రూ. 20లక్షలు, ఆరోగ్య బీమా పథకం కింద రూ. 10లక్షలు, ఉద్యోగ విరమణ కింద రూ.25లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలన్నారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉద్యోగులు తిరుపతి, రజిత తదితరులు పాల్గొన్నారు.

### సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

**- టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేందర్ రెడ్డి**

కలెక్టరేట్, డిసెంబర్ 12: రాష్ట్ర వ్యాప్తంగా 23 ఏండ్లుగా సర్వ శిక్ష అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న వివిధ రకాల సిబ్బందికి సమాన వేతనం చెల్లించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మూడ్రోజులుగా సమ్మె చేస్తున్న ఉద్యోగులకు టీపీటీఎఫ్ తరఫున మద్దతు తెలిపి మాట్లాడారు. సర్వ శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని, అన్ని రకాల సెలవులు ఇవ్వాలని, హెల్త్ కార్డులు జారీ చేయాలని, వారి సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

# కార్మికుల నివాసాలకు రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించాలి

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): కార్మిక క్షేత్రంలోని నివాసాలకు రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించాలని తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం అమృతలాల్ శుక్లా భవనంలో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలోని బద్దం ఎల్లారెడ్డినగర్, సుందరయ్యనగర్, ఇందిరానగర్, రాజీవ్ నగర్, పద్మనగర్ వార్డులలో ప్రభుత్వం 45 ఏండ్ల క్రితం నివేశన స్థలాల పట్టాలిచ్చిందని, వాటికి రిజిస్ట్రేషన్ హక్కులేక పట్టాదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపల్ పరిధిలో ఉన్న ఈ వార్డులు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, రిజిస్ట్రేషన్ హక్కు లేకపోవడంతో పేదలు బ్యాంకు రుణాలు తీసుకొని, వ్యాపారాలు చేసుకోవడానికి వీలు లేకుండా పోయిందన్నారు. కనీసం ఇంటి నిర్మాణానికి సైతం బ్యాంకులు రుణాలు ఇవ్వని పరిస్థితి ఉందన్నారు. నివేశన స్థలాలకు రిజిస్ట్రేషన్ హక్కు కల్పించాలని మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదించినా స్పందన రాలేదన్నారు. తమ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేపట్టినపుడు మాత్రమే సమస్య పరిష్కరిస్తామంటూ పార్టీలు హామీలు ఇవ్వడం తప్ప చేసింది శూన్యమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పేదల పరిస్థితిని అర్థం చేసుకుని రిజిస్ట్రేషన్ హక్కు కల్పించాలని, లేదంటే ప్రజా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎగబట్టి ఎల్లారెడ్డి, పట్టణ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేశ్, నక్క దేవదాస్, ఉడత రవి, కోలా శ్రీనివాస్, సందుపట్ల పోచమల్లు పాల్గొన్నారు.

## ఎన్నికలకు సహకరించాలి

ముస్తాబాద్/వీర్నపల్లి/ రుద్రంగి/ ఇల్లంతకుంట/ వేములవాడ/ వేములవాడ రూరల్/ గంభీరావుపేట, డిసెంబర్ 12: ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నికలు సజావుగా జరిగేందుకు గ్రామాల్లోని రాజకీయ పార్టీల నాయకులు, వివిధ సంఘాల నాయకులు సహకరించాలని ఆయా మండలాల ఎంపీడీవోలు పిలుపునిచ్చారు. గురువారం ముస్తాబాద్‌లో ఎంపీడీవో బీరయ్య, వీర్నపల్లిలో ఎంపీడీవో అబ్దుల్ వజిద్, రుద్రంగిలో ఎంపీడీఓ నటరాజ్, ఇల్లంతకుంటలో ఎంపీడీవో శశికళ, వేములవాడ, వేములవాడ రూరల్ ఎంపీడీవోలు మల్హోత్రా, శ్రీనివాస్ ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వివరాలు తెలియజేశారు. త్వరలోనే జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల వివరాలు నోటీస్ బోర్డుపై అతికించినట్లు చెప్పారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. అలాగే గంభీరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఆయా పార్టీల నేతలతో మండల పంచాయతీ అధికారి రాజేశ్వర్‌గౌడ్ సమావేశం నిర్వహించారు.

## సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 12: సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్స్ విక్రయిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ లావణ్య హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ ఏరియా, పెద్దబజార్ ప్రాంతాలలోని ప్లాస్టిక్ కవర్స్ విక్రయిస్తున్న వ్యాపార సముదాయాలపై ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలో 120మైక్రాన్స్ కన్నా తక్కువ మందం గల సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్స్ 60గ్రాములు గల నాన్ ఓపెన్ కవర్స్ విక్రయిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలలో భాగంగా ఆయా దుకాణాల్లో నిల్వ ఉంచిన సింగిల్ యూజ్ కవర్స్‌ను స్వాధీనం చేసుకుని నిర్వాహకులు జరిమానాలు విధించినట్లు తెలిపారు. ఇక్కడ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఉన్నారు.

## ఆరోగ్య బీమా చేయించుకోవాలి

కలెక్టరేట్, డిసెంబర్ 12: ప్రతి ఒక్కరూ ఆరోగ్య బీమా చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా వసంతరావు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, అభా, ఎన్‌సీడీ కార్యక్రమంపై సమీక్షించి, పీహెచ్‌సీ వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులకు ఆయుష్మాన్ భారత్ కార్డుపై పలు సూచనలు అందించారు. 16 ఏండ్ల నుంచి 59 ఏండ్ల వయస్సు ఉన్న గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్య బీమా, ఆయుష్మాన్ ఆరోగ్య హెల్త్ కార్డు ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు గురించి దిశానిర్దేశం చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్ రజిత, డీడీఎం కార్తీక్ ఉన్నారు.